# గుండె లోతులు

ఒక్క సారిగా ఛాతీలో అదిమిపట్టినట్లు, పిండినట్లు బాగా నొప్పి.ఆ నొప్పి ఎడమచేతిలోకి పాకి భరించలేని బాధ.

"అబ్బా!" సావిత్రి బాధగా మూలుగుతూ కుర్చీలో దబ్బున కూలబడింది. చేతిలో వున్న మంచినీళ్ల గ్లాసు పట్టుజారి నేలమీద పడింది.



ఆ శబ్దానికి, న్యూస్‌పేపర్ చదువుతున్న కృష్ణయ్య తుళ్లిపాటుగా తలెత్తి చూశాడు. ఛాతిని కుడిచేత్తో సవరించుకుంటూ, బాధతో విలవిలలాడుతున్న సావిత్రి కంటబడింది.

ఆదుర్దాగా లేచి భార్యదగ్గరకు వెళ్లాడు. "సావిత్రి! ఏంటి? ఏమైంది?" ఆందోళనగా అడిగాడు.

"గుండెలో నొప్పి...."

ఆమె పడుతున్న బాధ తీవ్రత కన్నీటి రూపంలో కళ్ల నుండి ఉబికివస్తున్నది.

"అయ్యో! గుండె నొప్పా!" భార్యను పొదివిపట్టుకుని మంచం దగ్గరకు తీసుకెళ్లి పడుకోబెట్టాడు.

పళ్ల బిగువున బాధను అనుభవిస్తున్న సావిత్రికేసి దీనంగా చూస్తూ, ఆమెనాస్థితిలో ఒంటరిగా వదిలి వెళ్లలేక, అక్కడే వుండి ఉపశమనానికి తనేమీ చెయ్యలేక సతమతమవుతూ నిలబడున్నాడు కృష్ణయ్య.

పది నిమిషాల్లోనే నొప్పి తగ్గుముఖం పట్టి సావిత్రి తేరుకోసాగింది.

"వెళ్లి, ఎవరితోనన్నా డాక్టర్‌గారికి కబురుపెడ్తాను" వెళ్లబోయాడు.

"వద్దు.... వద్దండీ.... నొప్పి తగ్గింది. ఫరవాలేదు". వారించింది భర్తను.

"ఇదే మొదటిసారా?"

"కాదు నెలరోజులుగా తరచూ వస్తున్నది".

"నాతో ఎందుకు చెప్పలేదు?"

"ఈ వయస్సులో రోగాలూ, రొష్టులూ రాకుండా వుంటాయా? మీరసలే కంగారు మనిషి!" మెల్లగా లేచి కూర్చుంటూ అన్నది సావిత్రి.

ఆ లక్షణాలు ఏ జబ్బువో అనుభవజ్ఞుడైన రోగిగా కృష్ణయ్యకూ తెలుసు. ఆ రోగితో సహచర్యమున్నందు వలన సావిత్రి గ్రహించగలదు.

సాయంత్రం భార్యను హార్ట్ స్పెషలిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాడు. ఆయన ఇ.సి.జి. రక్తపోటు వగైరా పరీక్షలు చేసి మందులు రాసిచ్చాడు. వారం రోజుల తర్వాత తీసుకురమ్మన్నాడు.

మందులు వాడుతున్నప్పటికి నొప్పి వస్తూనే వుంది. నొప్పిరాగానే డాక్టర్ ఇచ్చిన టాబ్లెట్ మింగితే క్షణాల్లో ఉపశమనం కలుగుతుంది. ఎప్పటికప్పుడు డాక్టర్ని కలుస్తూనే వున్నారు. సలహా ప్రకారం మందులు వాడుతూనే వున్నారు.

"ఏం ఫరవాలేదు! మందులకు తగ్గిపోవచ్చని డాక్టర్ గారు అంటున్నారు". భార్యకు ధైర్యం చెప్తున్నాడు కృష్ణయ్య.

* * *

అప్పటికింకా ఆయనకు ఐదు పదులన్నా నిండలేదు. తరచూ ఛాతిలో నొప్పి రావటం మొదలైంది. డాక్టర్ పరీక్షించి గుండె జబ్బన్నారు. మందులతో తగ్గవచ్చనీ అన్నారు.

కాని మందుల వల్ల ఫలితం కనిపించలేదు. ప్రాణాపాయం ముంచుకురాసాగింది.

డాక్టర్ చివరకు బైపాస్ సర్జరీ చేయించక తప్పదని సూచించాడు. వెల్లూరు తీసుకెళ్లమన్నాడు. ఆపరేషన్ ఖర్చు లక్షపైనే కావచ్చన్నాడు.

లక్ష! అంత డబ్బెక్కడిది? నెలనెలా ఆయనకొచ్చే జీతం కుటుంబ ఖర్చులకు బొటాబొటిగా సరిపోతుంది. కాస్తో కూస్తో పొదుపు చేసుకుంటూ వచ్చిన డబ్బు పిల్లలు కాలేజీ చదువుల కొచ్చేసరికి కరిగి పోయింది.

"సావిత్రీ! ఈ రోగం మనలాంటి వాళ్లకు రావాల్సింది కాదే! ఎలా జరగాలనుంటే అలా జరుగుతుంది!" భర్త మాటల్లో చేష్టల్లో ప్రాణభయం తొంగి చూస్తున్నది.

తండ్రి ప్రాణాలకు ముప్పు వస్తే అర్థాంతరంగా ఆగే తమ చదువుల గురించి. అంధకారం అయ్యే తమ భవిష్యత్తు గురించి ఆందోళన పిల్లల ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తున్నది.

అంత డబ్బు అప్పో సప్పో చేసి తెచ్చినా అసలూ, వడ్డీ కలిపి తీర్చాలంటే మాటలా! అప్పులు తీరుస్తూ కూర్చుంటే కుటుంబం గడిచేదెలా?

భర్తకు పిత్రార్జితంగా సంక్రమించిన ఆస్తి, వుంటున్న ఇల్లొక్కటే. అమ్మినా ఆపరేషన్‌కు సరిపడా డబ్బు రాదు.

ఇక మిగిలింది ఒక్కటే దారి! బాగా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చి అన్నకు కబురు పెట్టింది. పరిస్థితి వివరించి తన నిర్ణయం చెప్పింది.

తనకు పుట్టింటి వాళ్లు అరణంగా ఇచ్చిన రెండెకరాల మాగాణి తక్షణం అమ్మి డబ్బు తీసుకురమ్మంది.

"నీదంటూ నీకు లేకపోతే ఎలానే! రేపటి నీ పరిస్థితి గురించి ఆలోచించుకున్నావా?" అన్నయ్య సంశయించాడు.

"ముందు ఈ గండం గడవాలి. రేపెలాగన్న ప్రశ్న నా ఒక్కదాని విషయంలో కాదు. కుటుంబం బజారున పడకూడదు" అంటూ మరో మాటకు సందు ఇవ్వలేదు.

నాలుగు రోజుల్లో రెండెకరాల పొలం అమ్మి డబ్బు తెచ్చి చేతిలో పెట్టాడు. అవసరానికి తగినంత రాలేదు. చేతులకున్న బంగారు గాజులు తీసిచ్చింది.

"ఇవీ అమ్మమంటున్నావా?" నిర్ఘాంత పోయాడు తోడబుట్టినవాడు.

"నాకు ఈ భోగభాగ్యాలు కాదు ముఖ్యం. సౌభాగ్యవతిగా కలకాలను కుంటున్నాను" చెప్పింది.

మరోమాట మాట్లాడలేకపోయాడు అన్న.

గాజులమ్మి డబ్బు తెచ్చిచ్చాడు. ఆపరేషన్‌కు కావల్సినంత మొత్తం మీద సమకూరింది. ఇక నిశ్చింతగా బయల్దేరవచ్చు. ఆ విషయమే భర్తకు అన్నతో చెప్పించింది.

"సావిత్రీ! నాకు తెలీకుండా ఇదంతా ఎందుకు చేశావు?"

"మనందరికోసం. మీకేదన్నా అయితే ఈ పిల్లల భవిష్యత్తు ఏం కావాలి? వాళ్ల చదువులు, పెళ్లిళ్లు.... బరువు బాధ్యతల్ని నేనొక్కదాన్ని ఎలా మోయగలను? అందర్నీ దిక్కులేని పక్షుల్ని చేస్తారా?" ఏడ్చింది తను. ఆపరేషన్‌కు భర్తను ఒప్పించింది.

ఇంటినీ, పిల్లల్ని వదినకు అప్పగించి అన్నను సాయంగా వెంటబెట్టుకుని తనూ ఆయనా వెల్లూరు వెళ్లారు.

ఆపరేషన్ జరిగింది. దాదాపు నెల రోజులపాటు వెల్లూరు ఆస్పత్రిలోనే వున్నారు. వేళకు నిద్రాహారాలు లేకుండా కంటిరెప్పలా భర్తకు సేవలు చేసింది. మానసిక స్థైర్యాన్నిచ్చి కాపాడుకుంది. లక్ష ఖర్చయితేనేం. తిరిగి బతికి బట్టకట్టగలిగాడన్నారంతా!

పూర్తిగా స్వస్థత చేకూరేవరకు నాలుగైదు నెలలపాటు ఆయన సెలవులోనే వున్నారు. ఉన్నంతలో ఇల్లు గడవటం కోసం నానా కష్టాలు పడింది. వేన్నీళ్లకు చన్నీళ్లన్నట్టు మూలపెట్టిన కుట్టు మిషను తీసి బట్టలు కుట్టింది. ఇంట్లో అందరూ తిన్నాక మిగిలితే ఒక ముద్ద తిన్నది. లేకుంటే పస్తులుంది.

భర్త తిరిగి డ్యూటీలో చేరాక నిశ్చింతగా ఊపిరి పీల్చుకుంది. అన్న ద్వారా చిల్లర మల్లరగా చేసిన అప్పుల్ని రెండో కంటికి తెలియకుండా సర్దుబాటు చేసుకోగలిగింది. భర్త ఆరోగ్యం మీద మానసికంగా ఎలాంటి ఒత్తిడి పడకుండా, పిల్లల చదువులకి ఏమాత్రం ఆటంకం రాకుండా, ఆరు నెలల్లోనే వెనుకటి స్థితికి కుటుంబాన్ని తీసుకుర్రాగలిగింది.

ఆ సంవత్సరాన్ని ఒక పీడ కలలా మరిచిపోయారంతా!

ఇప్పుడెలాంటి బరువు బాధ్యతలూ లేవు. ఒక్కగానొక్క ఆడపిల్ల అరుణకు పెళ్లి చేసి పంపారు. అల్లుడు గెజిటెడ్ ఆఫీసర్. కొడుకులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగాల్లో వున్నారు. పెళ్లిళ్లయ్యాయి. ఎవరి పాటికి వాళ్లు తలో ఊరిలో ఏ లోటూ లేకుండా బ్రతుకుతున్నారు.

తనకు బ్రతుకు పట్ల విరక్తిగాని, జీవితం పట్ల మితిమీరిన ఆపేక్షగాని లేవు. 'పోతే బాగుండును' అని మరొకరు తన గురించి అనుకోకుండా కన్నుమూస్తే చాలు!

శనివారం సాయంత్రం అరుణ పిల్లలిద్దర్నీ వెంటబెట్టుకుని వచ్చింది. పిల్లలకు వేసవికాలం సెలవులిచ్చాక ఒకసారి వచ్చి వెళ్లిందంతే!

"అదేంటే! రెండు వారాల్లో ఎటూ దీపావళి రాబోతుంది. అప్పుడొస్తే బాగుండేది కదా! అటూ ఇటూ కాకుండా ఊడిపడ్డావేం?" కూతుర్ని అడిగింది సావిత్రి.

"అవన్నీ ఎవరు చూశారమ్మా! నిన్ను చూడాలనిపించి వచ్చాను. నీ ఆరోగ్యం అదీ ఎలా వుంటుంది?" తల్లినడిగింది అరుణ.

"నాకేం! లక్షణంగా వుంది" చెప్పింది పిల్లల్ని ఒడిలోకి తీసుకుంటూ.

మరుసటి రోజుకు కొడుకులిద్దరూ ఒకేసారి రావటంతో సావిత్రికి అనుమానం కలిగింది. ఆయనేమన్నా పిలిపించారా?

ఆ విషయమే ఒంటరిగా వున్నప్పుడు చూసి భర్తనడిగింది సావిత్రి.

"అబ్బే! అలాంటిదేం లేదు. అంత అవసరం ఏముంది? అనుకోకుండా వచ్చారంతే?" భార్య సూటిగా అడిగేసరికి కృష్ణయ్య తడబడ్డాడు.

భర్త మాటతీరు సావిత్రిని నమ్మించలేకపోయింది. రకరకాల అనుమానాలు తన ఆరోగ్యం గురించి ఆమెలో కలగటం మొదలైంది. అప్పుడప్పుడూ వచ్చే నొప్పి రోజూ రావటం మొదలైంది. ఆరోగ్యం రోజు రోజుకూ దిగజారుతున్నట్లు ఆమెకు తెలుస్తూనే వుంది. అందుకు బేజారెత్తటం లేదు.

డాక్టర్ పరిస్థితి చెయ్యి జారిపోతుందన్నాడా! ఆయనలా తనకూ గుండె ఆపరేషన్ చేయించాలన్నాడా? చేయించాల్సి వస్తే అంత డబ్బు ఎక్కడిది?

ఆ సాయంత్రం కాస్త ఎక్కువగానే సావిత్రికి గుండెనొప్పి వచ్చింది. టాబ్లెట్స్ మింగించారు. కళ్లు మూసుకుని అలసటతో అలానే నిద్రలోకి జారిపోయింది.

రెండు గంటల తర్వాత హఠాత్తుగా మెలకువ వచ్చిందామెకు. నీరసంగా వుండి మంచం మీద నుండి లేవబుద్ధి కాలేదు. బెడ్‌లైట్ చుట్టూ ఎగురుతున్న తెల్లరెక్కల పురుగును పరిశీలనగా చూస్తుండిపోయింది.

హాల్లో కూర్చుని మాట్లాడుకుంటున్న భర్త, పిల్లల మాటలు మెల్లగా ఆమె చెవిన పడసాగాయి.

"మాట్లాడరేంట్రా! మీ అమ్మకు గుండె ఆపరేషన్ చేయించక తప్పదన్నాడు డాక్టర్. ఎంత లేదన్నా లక్షకు పైన అవుతుంది. పెన్షన్ కొంత అమ్మగా వచ్చిన డబ్బుతోనే గదా అరుణ పెళ్లి జరిపించింది. పెన్షన్ వెయ్యి రూపాయలకన్నా రావటం లేదిప్పుడు. బొటాబొటిగా తిండికి, అనారోగ్యాలకి సరిపోతుంది. బ్యాంకులో పదివేలున్నాయి. మీ ఉద్దేశం చెప్పండి" అడిగాడు కొడుకులిద్దర్నీ.

పిల్లల్ని రప్పించటంలో భర్త ఆంతర్యం అప్పుడు బోధపడింది సావిత్రికి.

"మా దగ్గర మాత్రం డబ్బెక్కడిది నాన్నా! మేమూ నెలజీతాల మీద బ్రతకటమేగా! నీకు తెలీని ఆస్తులు మాత్రం మాకు ఎక్కడివి? ఐదో, పదో అప్పో సప్పో చేసి కష్టంమీద ఇవ్వగలం" పెద్దకొడుకు చెప్పాడు.

"ఐదూ, పదులతో అయ్యేదైతే ఇంత ఆలోచన ఎందుకు? వున్నదల్లా ఇదుగో ఈ ఇల్లు. అమ్మితే లక్షకు పైనే వస్తుంది. అయితే ఆ తర్వాత ఏమిటన్నది నా ఆలోచన?" సమాధానం చెప్పమన్నట్లుగా ఆగాడాయన.

సావిత్రి గుండెలో సన్నగా బాధాపూరితమైన ప్రకంపన మొదలైంది.

భర్త ప్రాణాలకు జరిగే హాని గురించే తను ఆనాడు తల్లడిల్లింది. తన సర్వస్వాన్ని అమ్మితే కలిగే నష్టాల్ని తను బేరీజు వేసిందా? పుట్టింటి వాళ్ల సలహాలు తీసుకుందా? వీళ్లేగా తన సమస్తం అనుకున్నది!

బయట తండ్రీ కొడుకుల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. లాభ నష్టాల గురించే లెక్కలు వేస్తున్నట్టున్నారు.

"నాన్నా! అమ్మకు ఇంత వయసులో అంత పెద్ద ఆపరేషన్ ఎందుకూ? ఖర్చుకు వెనకాడకుండా చేయించినా ఏమాత్రం ప్రయోజనం వుంటుందో! అమ్మ మొయ్యాల్సిన బరువు బాధ్యతలైనా ఏమున్నాయి! కావాలంటే ఇంకా పెద్ద డాక్టర్‌కు చూపించి మందులే వాడండి. మాకంటూ మిగిలింది, చెప్పుకోగలిగిందీ ఈ ఇల్లొక్కటేగా!" చిన్న కొడుకు తర్కబద్ధంగా మాట్లాడుతున్నాడు.

ఆ మాటలు ఒకటి కొకటి పెనవేసుకుంటూ సావిత్రి గుండెను మెలితిప్పసాగాయి. రెండు చేతుల్ని ఎవరో కరకరా నములుతున్నట్లుగా బాధ, ఆయాసంతో ఊపిరి పీల్చటం కష్టంగా వుంది. చెమటలు పోసుకొస్తున్నాయి.

భర్త నిర్ణయం ఏమిటన్నది చెవిన బడేవరకైనా తన ప్రాణం నిలబెట్టుకునేందుకు సావిత్రి తాపత్రయపడసాగింది.

*(ఆంధ్రప్రభ, 15.12.1994)*